# 36. పిరికివాడు

మూడు గంటలకి మధ్యాహ్నం వాళ్ళకి ఆర్డర్లు యిచ్చారు.

పదిమందికి మానేజర్ ప్రమోషన్లు దొరికాయి.

సంస్థ జనరల్ మేనేజరు వాళ్లను పిలిచి అభినందించారు.

సాయంకాలం అయిదున్నర వరకు కరచాలనాలతోనే వాళ్ళకి అయిపోయింది.

ఆరు తరువాత వాళ్లు ఫాక్టరీ మెయిన్ గేటు నుండి వెళ్తున్నప్పుడు మోహన్‌సింగ్‌కి ఒక ఆలోచన వచ్చింది.

"మనమీ రాత్రి క్లబ్బులో సెలిబరేట్ చేసుకుందాం. జీవితంలో ఇదిగొప్ప రోజు." అతను మిత్రులతో అన్నాడు.

స్వామినాథన్, సుకుమార్, పూర్వేందుభట్టాచార్య, చతుర్వేది, సన్యాల్....ఒకరేమిటి అందరూ ఏక కంఠంతో ఆమోదించారు.

మోహన్‌సింగ్ పార్టీ బాధ్యత తనమీద వేసుకున్నాడు.

క్లబ్బులోని ఖాన్‌సామా పాతవాడు. దొరల దగ్గిరపనిచేసి మెప్పులు పొందాడు. సెవెన్‌కోర్సు డిన్నరా, ఎలెవెన్ కోర్సు డిన్నరా అని అడిగాడు. ఓరియంటల్ స్టయిలో , వెస్టరన్ స్టయిలో చెప్పమన్నాడు. క్లబ్బులో తరచుపార్టీలు అవుతుంటాయి. వేటికీ చూసుకోనక్కరలేదు.

బ్రిడ్జి ఆడేగదిలో డిన్నరుకి టేబిళ్లు సర్దమన్నాడు మోహన్‌సింగ్. సాయంకాలం ఆరు దాటినతరువాత కబురు తెలిసింది. అందుచేత రాత్రి తొమ్మిదిన్నర తరువాతే డిన్నరన్నాడు ఖాన్‌సామా.కాంపారీ ఒక బాటిలు భద్రంగా దాచానని బార్‌మన్ చెప్పాడు. ఐస్ క్యూబులు, సోడాలు, అన్నీ అన్నీ- వేటికీ క్లబ్బులో తడుముకోనక్కర లేదన్నాడు మరో బేరరు.

ధర్మపత్నులను కూడా డిన్నరుకి పిలుద్దామని ఒకరిద్దరన్నారు కానీ ఖాన్‌సామా మాత్రం, ప్రస్తుతానికి వాళ్లని పిలవొద్దని చెప్పాడు. అందరికీ పెద్ద పార్టీ యివ్వవలసినప్పుడు ఏలాగా ధర్మపత్నులు తప్పనిసరి. ఇప్పుడు పదిమందీ హాయిగా సెలిబరేట్ చేసుకుంటే బాగుంటుందన్నాడు.

శ్రేయోభిలాషుల అభినందనపరంపరల నుండి వాళ్లు విముక్తులయే సరికి రాత్రి పది గంటలయింది.

వాళ్లందరూ చాల ఉల్లాసంగా ఉన్నారు.

సాధారణంగా డిప్యూటీ మేనేజరుగా మూడు సంవత్సరాలు పనిచేసిన తరువాత, అధికారి మానేజరు పదవికి అర్హుడవుతాడు. కాని, ప్రతి రూలుకి ఏవో అమెండుమెంటులుంటాయి. మూడేళ్ళకు లోపుగానే కొంతమందికి ప్రమోషన్లు ఇస్తారు. అసాధారణమైన ప్రజ్ఞ. నిరంతరమైన పరిశ్రమ మొదలయిన కారణాలు చాల చెప్పి, పేజీల కొలది వాళ్ల విజయాలను ఉగ్గడించి, క్రమం తప్పించి వాళ్లను పైకి తీసుకువస్తారు. కిట్టనివాళ్లు కొంతమంది, ఈ ప్రమోషన్లు ఆశ్రిత పక్షపాతులకే నంటారు. ఇంకేవేవో కారణాలు అంటగడతారు.

ఆవిధంగానే, మూడు సంవత్సరాలు దాటినా కొంతమందికి ప్రమోషన్లు దొరకవు. 'పాపం! వాళ్లకర్మ' అంటారు కొందరు. కారణాలు చెప్పడానికేముంటాయి. కుక్కని చంపాలంటేముందు అది పిచ్చిదని చెప్పాలి. తరువాత దానిని సులువుగా కాల్చి పారేయవచ్చు. అలాగే ప్రమోషను ఇవ్వని వాళ్లని అసమర్థులని, నేర్పుతో వ్యవహరించలేని వాళ్లని, ఇంకా ఏవేవో కారణాలు చెప్పి, మర్యాదగా వాళ్లని పక్కను బెడతారు. కాని,ఎంతకాలం అలా చేయగలరు? ఆ సంవత్సరం కాకపోతే వచ్చే యేడో, లేకపోతే ఆ వచ్చే యేడో వాళ్లకు ప్రమోషన్లిస్తారు, లోకంకోసం.

ఈ సంవత్సరమిచ్చిన పది ప్రమోషన్లలో అయిదు మందికి రెండు సంవత్సరాలు నిండకముందే మీదికితోశారు. నెలలు నిండకుండా పుట్టిన శిశువులను ఇంక్యుబేటర్లు మొదలైన వాటిలో ఉంచి చాల జాగ్రత్తగా కాపాడాలి. ఆవిధంగానే తోటివాళ్ల తలలమీద కాళ్లు వేసి మీది కొచ్చిన ప్రబుద్ధులకు చాల రక్షణలు కల్పిస్తారు. వాళ్లు పై అధికార్ల ముద్దు బిడ్డలు.

మిగిలిన అయిదుగురిలో , ఒకరికి నాలుగు సంవత్సరాల తరువాత, ఇద్దరికి అయిదు సంవత్సరాల తరువాత ఇద్దరికి ఆరు సంవత్సరాల తరువాత ప్రమోషన్లిచ్చారు. వాళ్లు, వాళ్ళ తండ్రులు, తాతలు, తరించారని సంతోషించాలి.

ఒకరూ ఒకరూ క్లబ్బు చేరుకునే సరికి పది గంటల వేళ దాటింది. కాంపారీ నాలుగయిదు రౌండ్లు తిరిగి వాళ్లు డిన్నరుకి సిద్ధమయే సరికి మరో అరగంట పట్టింది.

టమాటో సూప్ మొదటి అయిటం. తరువాత రావలసినవి చికెన్ మసాలా, ఫ్రైడ్‌రైసు, మటర్‌పన్నీర్, ఆలూకాలీఫ్లవర్, పాపడ్, చట్నీ మొదలయినవి.

అందరూ చాల ఉల్లాసంగా సూప్ తాగుతున్నారు.

ఇంతలో హాలులో టెలిఫోన్ మోగింది. రెండేరెండు నిమిషాలు - బేరర్ వచ్చి మోహన్‌సింగ్ చెవిలో ఏదో చెప్పాడు. అతను ఫోను దగ్గిరకి పరుగెత్తాడు.

అటునుంచి మానేజింగ్ డైరక్టరు గారు మాట్లాడారు.

ఉన్న పాళంగా ప్రమోషన్ దొరికిన మానేజర్లందరినీ హాస్పిటలుకు వెళ్లమని అతను ఆజ్ఞాపించారు. సుబ్రతోముఖర్జీని చావు బ్రతుకులలో హాస్పిటలులో చేర్చారు.

సెవెన్‌కోర్సు డిన్నరులో ఆరుకోర్సులు అలాగే విడిచిపెట్టి ఆపదిమంది హాస్పిటలుకి పరుగులు తీశారు.

" ఈ సుబ్రతో ఎప్పుడూ ఇటువంటి పనులే చేస్తాడు. మరోరెండు గంటలతరువాత హాస్పిటలులో చేరినా బాగుండేది."అన్నాడు వాళ్లలో ఒక భోజన ప్రియుడు.

చాలమంది ఆసరికి హాస్పిటల్ దగ్గిర జమయారు. పెద్ద పెద్ద డాక్టర్లు, గొప్ప ఎక్విప్‌మెంటు-ఏలోపం లేకుండా అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయి.

హాస్పిటలు ఆవరణలో ఒక నూరు వరహాల చెట్టుంది. దానికి కొంచెం ఎత్తులో మెర్క్యురీ దీపం వెలుగుతోంది. ఆకాంతి చెట్టు నిండా ఉన్న తెల్లని పూలమీద, దట్టంగా నున్న ఆకులమీద పడి, వాటికి వింతవింత రంగులు పులుముతోంది.

చెట్టుకి కొద్ది దూరంలో రెండు పెద్ద అరుగులున్నాయి. వాటిమీద కొంతమంది కూర్చున్నారు. వాళ్లకు మరేపనిలేదు. సుబ్రతో గురించి మేనేజింగ్ డైరక్టరు హాస్పిటలు కు వెళ్లమని ఆజ్ఞాపించారు. లేకపోతే వాళ్లు డిన్నరు విడిచి చచ్చినా వెళ్లేవారుకారు.

"ఇంతకీ అసలేమయిందో నాకు తెలీదు. ఎందుకితని ని హాస్పిటలులో చేర్చారు?" ఒకడు ప్రశ్నించాడు.

సుబ్రతో ముఖర్జీ తల్లి దండ్రులు బంకురా వెళ్లారు. ఇంట్లో పనివాడు తప్ప మరెవరూ లేరు. సాయంకాలం వండిపెట్టి , రాత్రి వచ్చేసరికి పదిగంటలవుతుందని వాడు యజమానితో చెప్పి వెళ్లిపోయాడు. వాడు తిరిగి వచ్చేసరికి అతను హాలులో కనిపించలేదు. డైనింగు టేబిలు మీద పెట్టిన వంట అలాగే ఉంది. బాత్‌రూమ్ తలుపులు దగ్గిర పెట్టి ఉంటే తోసుకొని వాడులోపలికి వెళ్లాడు. అక్కడ అతను నేలమీదపడి ఉన్నాడు. వెంటనే వాడు హాస్పటులుకు ఫోనుచేసి ఆంబులెన్సులో అతనిని హాస్పిటలుకు తెచ్చాడు. " అన్నాడు పూర్ణేందు.

"అతని భార్య ఏమయింది. ?

" ఆమె కలకత్తా లో ఉంటున్నది".

గాజద్దాలలోంచి కారిడారులో డాక్టర్లు తొందరగా తిరుగుతూ ఉడడం కనిపించింది.

" నాకతని గురించి అంతగా తెలీదు. " అన్నాడు మరొకడు, ఇంకా కొత్త విషయాలు తెలుసుకోవాలని.

" నాకీ సుబ్రతో చిన్నప్పటినుంచి తెలుసు. మేమిద్దరం కలిసి చదువుకున్నాం. వాళ్ల తండ్రిగారు చండశాసనులు. హైస్కూలు హెడ్మాష్టరుగా పనిచేసి రిటైరయారు. ఉద్యోగం చేసినన్నాళ్లు కిందివాళ్లను కాల్చుకు తిన్నారు. రిటైరయిన తరువాత ఇంటివాళ్లని".

"సుబ్రతోకి అన్నదమ్ములా ..."

"ఎవరూ లేరు. అతను వాళ్లకి ఒక్కడేకొడుకు".

"అయినా ముద్దుగా చూసుకోలేదా?"

"వాళ్ల తండ్రిగారు ఎవరినీ లక్ష్య పెట్టరు. అతను కూర్చోమంటే సుబ్రతో కూర్చుంటాడు. రాత్రి పన్నెండువరకు చదవాలంటే అదే చేశాడు. ఫస్టు క్లాసు రావాలంటే తెచ్చుకున్నాడు. ఇంజనీరింగు చదవాలంటే చదివాడు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలో పాసవాలంటే అయాడు. ఉన్న ఊళ్లోనే ఉద్యోగంలో చేరాలంటే ఇక్కడే చేరాడు".

"వాళ్లమ్మగారు నీకు తెలుసా?"

"తెలియకేం! ఆమె చాల ఉత్తమురాలు"

"ఆమె ఏమి చెప్పలేదా?

"ఆవిడ మంచి బుద్ధులన్నీ నేర్పింది. తనకు లేకపోయినా ఇంకొకరికి పెట్టమంది. పరుషంగా మాట్లాడి ఎదుటి వారి మనస్సును కష్టపెట్ట వద్దంది. అందరితోను సఖ్యంగా ఉండమంది. నలుగురూ పోయిన మంచిదారిలో నడవమంది."

పూర్ణేందుకి సుబ్రతోయింటి విషయాలు బాగా తెలుసు. స్వామినాథన్‌కి చతుర్వేదికి అంతగా తెలియవు. మోహన్‌సింగుకి ఈపాటి ఆపాటి తెలుసు. సన్యాల్ అతని షాపులో పనిచేస్తున్నాడు. అందుచేత అతని పనిపాటుల గురించి తెలుసు.

రాత్రి పన్నెండు తరువాత వాళ్లో కుర్రాడిని పిలిచి దూరంగా నున్న దుకాణం నుంచి టీ తెప్పించు తాగారు.

ఒంటి గంటకు వాళ్లకో సంగతి స్పష్టమయింది. సుబ్రతో ముఖర్జీ నిద్రమాత్రలు మింగాడు. కడుపు కడిగి, బతికించే ప్రయత్నాలన్నీ చేస్తున్నారు.

మోహన్‌సింగు సిగరెట్టు ముట్టించాడు. చెట్టుకింది అరుగుల మీద వాళ్లు పదిమంది మాత్రమే మిగిలారు.

"నాభార్య రాత్రి ఎనిమిది గంటలకి బజారు నుండి రిక్షా మీద వస్తుంటే, చౌరాస్తాలో సుబ్రతో కనిపించాడట. రోడ్డు పక్కనున్న పోస్టుబాక్సులో ఉత్తరాలు లెక్కపెట్టి వేస్తున్నాడట. నాభార్య ఓ క్షణం రిక్షా ఆపి, అన్ని ఉత్తరాలు అతను పోస్టు చేసి వెనక్కు తిరిగినప్పుడు అడిగిందట. ఈ ప్రేమలేఖలెవరికి వ్రాశారని, అతను జవాబు చెప్పకుండా ముఖం దించుకొని వెళ్లిపోయాడట." అన్నాడు మోహన్‌సింగు.

అపుడు చతుర్వేది అన్నాడు.

" రమారమి పదిరోజులకింద, నాభార్య టీచరు ఉద్యోగానికి అప్లికేషను పెట్టింది. దానితో పంపడానికి స్కూలు సర్టిఫికెట్లు మొదలైనవి కాపీ చేయించవలసి వచ్చింది. జెరాక్సు దుకాణం వాడు మనసుబ్రతో ముఖర్జీ ఒక అపీలో, అప్లికేషనో పాతిక కాపీలు చేయించాడని చెప్పాడు "

స్వామినాధన్ పూర్ణేందు పక్కను చేరి అన్నాడు.

"పాపం! ఇటువంటి క్లిష్టపరిస్థితులలో అతని తల్లి దండ్రులుగాని, భార్యకాని, కొడుకు కాని, మరే బంధువులు కాని లేరు. తెలియకడుగుతాను. అతని భార్య ఎన్నేళ్లయి కలకత్తా వెళ్లారు."

"ఎన్నేళ్లేమిటి, ఏడెనిమిది సంవత్సరాలయి ఆమె అక్కడే ఉంటున్నది."

"ఏదైనా ఉద్యోగం చేస్తున్నారా?"

"చాలమంచి ఉద్యోగమే. ఆమె ఈమధ్యనే వైస్ ప్రిన్సిపాల్‌గా లేడీ మేరీస్ కాలేజీలో ప్రమోషను తీసుకున్నారు."

"మరి సుబ్రతో కాపురం చెయ్యడం లేదా?"

"చెయ్యకేం, సెలవుల్లో ఆమె కొడుకుతో సహా యిక్కడికి వస్తుంది. సుబ్రతో కూడా తరచు వెళ్తుంటాడు."

"కలకత్తాలో ఆమె ఎక్కడుంటున్నారు?"

"పార్కు స్ట్రీటులో. ఆమె తండ్రిగారు పేరుమోసిన బారిష్టరు. ఆమె అతనికి ఒక్కతే కూతురు. తండ్రిగారి యింటే ఆమె ఉంటున్నారు."

"కొడుకేం చదువుతున్నాడు."

"ఈ సంవత్సరమే కాలేజీలో చేరాడు."

"మన ఊళ్లో కూడా కాలేజీ ఉంది కదా, ఇక్కడ చదవలేకపోయాడా?

"వాడు కొంచెం స్వతంత్రంగా వ్యవహరిస్తాడు. రెండు సంవత్సరాలు హైస్కూలు తరగతులు ఇక్కడే చదివాడు. తాతగారు తమ అలవాటు ప్రకారం ఇలా చెయ్యమని అలా చెయ్యకూడదని మనవడితో అంటే వాడు మొహమాటం లేకుండా, తనకు తోచినట్లు చేస్తానని జవాబు చెప్పాడు. ముసిలాయన, మనవడిని ఇక్కడ చదవొద్దని అంటే, వాడు తల్లితో కూడా కలకత్తా వెళ్లిపోయాడు."

"సుబ్రతో ఏమీ అనలేదా"

"అతను తండ్రికి సమాధానం చెప్పలేకపోయాడు. కొడుకుని ఒప్పించలేకపోయాడు. బామ్మకు మనుమడంటే ప్రాణం. ఆవిడకోసం అప్పుడప్పుడు వాడు తల్లితో వస్తుంటాడు."

స్వామినాధన్ సన్యాల్ వేపు తిరిగి అడిగాడు.

" మీతో పాటు సుబ్రతో షాపులో పనిచేసేవాడు కదా? ఎలా ఉండేవి పనిపాట్లు?"

"చాల శ్రద్ధతో పనిచేసేవాడు. ఉద్యోగానికి సరియైన వేళలో వచ్చేవాడు. రాత్రి ఏడు, ఎనిమిదింటివరకు ఇంటికి పోయేవాడుకాడు. ప్రతి వర్కరుతో కలిసి పనిచేసేవాడు . వాళ్ల

సలహామేరకు పనిపూర్తి చేయించేవాడు.''

"అంటే తనదంటూ ఒక నిర్ణయం తీసుకోలేడన్నమాట.''

"అతడు చాల సరియైన నిర్ణయమే తీసుకునేవాడు. కాని, ఫోర్మెనో, పనివాళ్లో మరో విధంగా చెప్తే, ఆ ప్రకారం పని చేయించేవాడు. ఆ పనిపాడయితే తిరిగి తనుముందు చెప్పిన ప్రకారం చేయించి పూర్తి చేయించేవాడు.

"అంటే పనివాళ్లను అదుపులో పెట్టలేడన్నమాట''

"నాకు ఎలా చెప్పడమో తెలియదు. అతను పనివాళ్లంటే చాల అభిమానపడతాడు. వాళ్ల మంచి చెడ్డలడుగుతాడు. వాళ్ల సలహాలకు విలువనిస్తాడు. వాళ్లతనిని దేవుడంటారు."

"పనిలో ఇలా వ్యవహరిస్తే అవుతుందా?''

"మీకో ఉదాహరణ చెప్తున్నాను. మూడు నెలల కింద డిప్యూటీ జనరల్ మేనేజరుగారు షాపు ఇనస్పెక్షనుకి వచ్చారు. చాల అర్జంటుగా కావలసినపని వెనుక బడింది. మొదటిసారి చేసిన వస్తువు పాడయిందని, అది మళ్లా మొదలు పెట్టారని అతనికి తెలిసింది. అతను సుబ్రతోను తరచి తరచి అడిగారు. కాని అతను జవాబు చెప్పలేదు. పనిపాడుచేసిన వర్కర్ల మీద ఎందుకు చర్య తీసుకోలేదని అతను అడిగాడు. దానికీ అతన జవాబు చెప్పలేదు. డిప్యూటీ జనరల్‌మేనేజరు గారికి చాల కోపం వచ్చింది. బాధ్యత అంతా అతని మీదే మోపారు. ఆ సంగతి అతని ఫైలులోకి ఎక్కించారు.''

"పని వాళ్లు ఏమీ.. ''

"వాళ్లు సారీ చెప్తే మాత్రం ఏం లాభం. ఆ సరికే జరగవలసిన హాని జరిగిపోయింది."

"ఈ ఉద్యోగం కత్తి మీద నడక''

ఇంతలో కారిడారులో కలకలం.

అన్ని ప్రయత్నాలు వ్యర్థమయ్యాయి.

సుబ్రతో ముఖర్జీ ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసి పోయాయి.

తూర్పున వెలుగు తోచింది.

పోలీసు ఇంక్వయిరీ కోసం, పోస్టు మార్టం కోసం శవాన్ని మోర్గులోకి తీసుకుపోయారు.

రాత్రి డిన్నరూ లేక, నిద్రాలేక, హాస్పిటల్ ఆవరణలో ప్రమోషను దొరికిన పదిమంది అలమటించిపోతున్నారు. ఇకనైనా తొందరగా యింటికి పోయి పడుక్కుందామనుకున్నారు. ఇంతలోనే హెడ్‌నర్స్ వచ్చి మోహన్ సింగ్‌ని పిలిచి మానేజింగ్ డైరెక్టరు టెలిఫోను మీద ఉన్నారని రమ్మని చెప్పింది.

"గుడ్‌మార్నింగ్ సర్,''

"మోహన్‌సింగ్! మీరు పది మంది అక్కడే ఉన్నారా?"

"అవును సార్!"

"మీరు అక్కడే ఉండండి. సుబ్రతోముఖర్జీ తల్లి దండ్రులు, అతని భార్యవాళ్లు వస్తున్నారు - పోస్టుమార్టం, మిగిలిన పనులు అయేవరకు మీరు వాళ్లతోనేఉంటారు."

"సర్, ఒక చిన్న రిక్వెస్టు."

ఆసరికే రెండో వేపు టెలిఫోను పెట్టేశారు.

చావు కబురు చల్లగా తెచ్చిన మోహన్‌సింగ్‌మీద వాళ్లు విరుచుకుపడ్డారు. కాని, ఏం చేయగలరు? ఎం. డి. గారి ఆజ్ఞ పాలించవలసిందే.

ఎనిమిది గంటలయేసరికి పోలీసులు వచ్చారు. చతుర్వేది ఇనస్పెక్టర్ని కలిసి వచ్చాడు.

"ఏమిటి సంగతి?" సన్యాల్ ప్రశ్నించాడు.

"పోలీసులు ఇల్లంతా గాలించారు. బాత్‌రూమ్‌లో నిద్రమాత్రల సీసా మూత దొరికింది. సీసా, మిగిలిన మాత్రలు టాయిలెట్‌లోపడేసి ఫ్లష్ చేశాడని అనుమానిస్తున్నారు."

"ఏదుకాణం మీద మాత్రలు కొన్నాడు?"

"పోలీసులు మందులషాపు రాకేష్ యింటిమీద దాడిచేశారు. అతను, నిన్న సాయంకాలం సుబ్రతోముఖర్జీకి నిద్ర మాత్రల సీసాఅమ్మినట్లు చెప్పాడు. ప్రతినెల అతను కొంటుంటాడని, డాక్టరు చీటీ ఉందని అతనన్నాడు. సుబ్రతోమెట్లు దిగి వెళ్లి పోతూ తిరిగి వచ్చి అతనిని అడిగాడట ఎన్నిమాత్రలు వేసుకుంటే మనిషి చనిపోతాడు అని. మనిషిని చంపడానికి పది మాత్రలు చాలునని, పదిహేనుమాత్రలు వేసుకుంటే మరి తిరుగులేదని రాకేష్ చెప్పాడట."

"తన మరణానికి ఎవరూ బాధ్యులు కారని వ్రాసిన ఉత్తరమేదీ దొరకలేదా?"

"ఇంట్లోకాని, జేబుల్లో కాని అటువంటిది దొరకలేదు"

ఇద్దరు, ముగ్గురు దీర్ఘంగా నిశ్వసించారు.

ఆ పది మందిముఖాలు పీక్కుపోయాయి. గడ్డాలు మాసి పోయాయి. కళ్లు లోతులకు పోయాయి.

అప్పటికి పది అయింది. మరి కొద్ది నిమిషాలలో కలకత్తానుండి కారులో సుబ్రతో ముఖర్జీ భార్య, కొడుకు, మామగారు వచ్చి ఒక్కసారి గొల్లుమన్నారు. పోస్టుమార్టమ్ ఆ సరికే మొదలయింది.

మరో పావు గంటలో మృతుడి తల్లిదండ్రులు వచ్చారు. ఆ తల్లి 'శోకంబుకట్టిన మూర్తి' - ఆ తండ్రి 'అతిదుఃఖభార భూమీనతాంగుడు' పెద్దకాబిన్ పైఅంతస్తులో ఖాళీగా ఉంటే వాళ్లందరూ అందులోకి వెళ్లారు - పదిమందీ నిలబడ్డారు. మిగిలిన వాళ్లు మంచాలమీద కుర్చీలమీద కూర్చున్నారు.

ఒక అరగంట వరకు చాల బాధాకరమైన దృశ్యాలు కళ్లబడ్డాయి.

బామ్మ మనుమడిని దగ్గిరికి తీసుకుంది. వాడన్నాడు:

"బామ్మా! నేను నందదేవి పర్వతారోహణకు ఎంపికయాను. ఆ సంగతి డాడ్‌తో ఆరాత్రే చెప్పాను. అతను సంతోషిస్తారనుకున్నాను. నన్ను దగ్గిరగా తీసుకున్నారు. తలమీదనిమిరారు. 'శరత్' ఈ సారికి వెళ్లకుండా ఉండలేవా?' అని దీనంగా అడిగారు - మాడాడ్‌కి ఏవో సందేహాలు. నాకేమీ బోధపడలేదు. ఎందుకని అడిగాను. ఎవడో జ్యోతిష్కుడు చెప్పాడట, ఈ నెలలో తండ్రికాని, కొడుకుగాని మాయిద్దరిలో మరణిస్తారని అతను చెప్పాడట. నాకీ పిచ్చినమ్మకాలంటే సరిపడదు. అయినా డాడ్ ముఖం చూస్తే ఏమీ అనలేక పోయాను. జీవితంలో ఇటువంటి గొప్ప అవకాశం రాదని, ఈ కష్టమైన పర్వతాన్ని ఎక్కి విజయం సాధిస్తే చాల గొప్ప పేరువస్తుందని నచ్చజెప్పాను. నేను పట్టుదలగా ఉండడం చూసి ఆయవ మరేమీ అనలేకపోయారు. ఉన్న ఈ ఒక్క కొడుకునీ రక్షించుకోడానిక ఇంత దారుణమైన పని చేస్తారని నేననుకోలేదు."

అక్కడ కూర్చున్న వాళ్లందరూ వలవలఏడ్చారు.

పరిస్థితిని అదుపులోకి తేడానికి, సుబ్రతో మామగారు కొద్ది సేపయిన తరువాత మాట్లాడారు.

"కిందటి సంవత్సరం ఇతనికి ప్రమోషను దొరకలేదు. అప్పటికి మూడు సంవత్సరాలయి వెనుకబెడుతున్నారు. అతను నా సలహా అడిగాడు. వివరాలు తెలుసుకున్న తరువాత నా కే కష్టమనిపించింది. హైకోర్టు నుంచి స్టేఆర్డర్లు తెప్పించి, ఎవరికీ రెండు మూడు సంవత్సరాలు ప్రమోషన్లు లేకుండా, అధికారుల ఆటలు కట్టిస్తానని చెప్పాను. కాని, అతనో మాటఅడిగాడు. 'కొంత మందికి చాల ఆలస్యంగా ప్రమోషను దొరికింది. వాళ్లు కూడా దెబ్బతింటారా' అని - హైకోర్డు ఆర్డరుకు మంచీ చెడ్డా తెలియదని,మంచి వాళ్లుకూడా ఇబ్బంది పడక తప్పదని నేను చెప్పాను. అతను కొంచెం సేపు ఆలోచించి అన్నాడు: 'నాకు ప్రమోషను లేకపోయినా పరవాలేదు. చాలాకాలం తరువాత ప్రమోషన్లు దొరికిన వాళ్లకి అన్యాయం జరగడం తనకు సమ్మతం కాదన్నాడు. అటువంటి మెత్తని మనసువాడు ఇటువంటి ఘోరమైన పని చేయడానికి ధైర్యమెక్కడ నుంచి వచ్చింది?"

అందరికళ్లల్లోను నీళ్లు.

మౌనంగా అందరూ పదిహేను నిమిషాల వరకు ఉండి పోయారు.

సుబ్రతోముఖర్జీ భార్య లప్పుడు మాట్లాడింది.:

"సెంట్‌మేరీస్ కాలేజీయజమానులు ప్రతిసంవత్సరం తమలెక్చరర్లలో ఒకరిని అమెరికా పంపుతారు. అక్కడ కాలేజీ విద్యావిధానాన్ని తెలుసుకోవడం ఒకవంతు, దేశమంతా తిరిగిరావడం మూడువంతులు. అన్ని సదుపాయాలు సమ కూర్చుతారు. ఈ సంవత్సరం నన్ను పంపడానికి

యజమానులు నిశ్చయించారు. పాసుపోర్టువచ్చింది- నిన్ననే వీసాదొరికింది - మరో అయిదురోజుల్లో ప్రయాణం. అమెరికా ప్రయాణం సంగతి తెలిసిన నాటి రాత్రి అతను కలకత్తాలోనే ఉన్నారు. ఈ సంతోషవార్తవిని అతను ఆనందించలేదు, ముభావంగా ఉన్నారు. గుచ్చి గుచ్చి కారణం అడిగాను. నేను అమెరికా వెళ్లవలసిన వారంలోనే తనకు ప్రమోషను దొరికింది లేంది తెలుస్తుందని, తనతో ఆనందంకాని, దుఃఖాన్ని కాని పంచుకోడానికి నాకన్న దగ్గిర వాళ్లులేరన్నారు. నేనతనిని చాల వరకు సమాధానపరిచాను. ప్రమోషను దొరికితే, అమెరికానుండి తిరిగిరాగానే పండుగ జరుపుకుందామన్నాను. ఒక వేళ ప్రమోషను దొరక్కపోతే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చివేయమన్నాను.నా తండ్రిగారి ఆస్తి, మామామగారి ఆస్తి రెండు తరాలవరకు ఖర్చు పెట్టినాతరగదు- పైగా నేను ఉద్యోగం చేస్తున్నాను - సుఖంగా జీవించడానికి ఇంతశ్రమపడి, మానసికంగా బాధపడి కుంగిపో నక్కరలేదని చెప్పాను. కాని, అతని అలోచనేవేరు. ఒక సంస్థలో ఇన్ని సంవత్సరాలయి దాని ప్రగతికోసం పనిచేస్తూ, ఇప్పుడు ఓటమి నంగీకరించి రాజీనామా యివ్వడం సరికాదన్నారు. నేనే కాని ఈ అమెరికా ప్రయాణాన్ని వాయిదా వేస్తే.."

ఆమె మరి చెప్పలేకపోయారు-గొంతు బొంగురుపోయింది. చెక్కిళ్లమీద కన్నీటివాగులు.

ఏదో తప్పు చేసినట్లు ప్రతిముఖంమీద ఉదాసీనత తోచింది.

మరో అరగంటలో పోస్టుమార్టమ్ ముగిసింది.

మిగిలిన పనులన్నీ తొందర తొందరగా అయిపోయాయి.

సుబ్రతో ముఖర్జీ చనిపోకముందు పోస్టుబాక్సులో వేసిన పాతిక ఉత్తరాలలోను ఓరెండు అతను చనిపోయిన నాలుగో రోజుకి మానేజింగ్‌డైరెక్టరుగారికి, డిప్యూటీ జనరల్ మానేజరుగారికి అందాయి. ఆ పాతిక ఉత్తరాలు ఒకేరకంవి.

మానేజింగ్ డైరెక్టరుగారికి అందిన ఉత్తరం టైపులో నాలుగుపేజీలు నడిచింది. చివరి పేరా మాత్రం సుబ్రతో ముఖర్జీ చేతివ్రాతలో ఉంది. ఎక్కడ నుంచి అతను వివరాలు సంపాదించాడో! అక్రమంగా ప్రమోషన్లు ఏవిధంగా కొందరికి దొరికాయో సాక్ష్యాలతో నిరూపించాడు. చివరిపేరా ఇలా ఉంది.

"ఈ ఉత్తరం నేను చనిపోయిన తరువాత మీకు చేరుతుంది. నాకు నాలుగు సంవత్సరాలయి ప్రమోషను వెనుక బెట్టారు. పై అధికారులు తమకు ఇష్టులైన వారిని పైకి తెస్తునే ఉన్నారు. వాళ్లకు ప్రమోషన్లు ఇచ్చినందుకు నాకు విచారంలేదు. నా కన్న తక్కువ సర్వీసు కలవాళ్లు, అనుభవంలేనివాళ్ళు, మూగనై నేను చూస్తూ ఉంటే, పైనపదవులు ఆక్రమించి, నిర్భాగ్యుడైన నావంటి సహోద్యోగి మీద కొంచెమేనా జాలిలేకుండా నిర్దాక్షిణ్యంగా అధికారం చెలాయిస్తున్నారు. ఇంతకన్న అన్యాయంకాని, చిత్రవధకాని వేరేలేవు. వీటన్నిటికీ అడ్డుకట్ట వేయడానికే నేను చనిపోతున్నాను. నా మరణానికి మీరందరూ బాధ్యులే!"

డిప్యూటీ జనరల్ మేనేజరు గారు ఉత్తరం చదువుతూనే తెలివితప్పిపడిపోయారు.

ఆయనను వెంటనే హాస్పిటలులో చేర్చారు. బ్లెడ్‌ప్రెసరుకు ట్రీట్‌మెంటు చేస్తున్నారు.

మరో పదిరోజులలో అధికార బృందమొకటి ఢిల్లీ నుంచి వచ్చింది. నాలుగురోజులు సుబ్రతోముఖర్జీ ఉత్తరంలోని విషయాలన్నీ విచారించి, ఆ పదిప్రమోషన్లను రద్దుచేసింది.

డిప్యూటీ జనరల్‌మేనేజరు గారికి హాస్పిటలులో ఉండగానే బదిలీ ఆర్డర్లు చేతికందాయి.

ప్రమోషన్లు రద్దయిన పదిమందిలో ఒకతను భరించలేక తన అక్కసు నలుగురి మధ్య తీర్చుకున్నాడు.

"దిస్ సుబ్రతో ఆల్వేస్ డిడ్ ది రాంగ్ థింగ్ ఎట్ ది రైట్‌మూమెంట్! (ఈ సుబ్రతో ఎప్పుడూ తప్పు పనిని సరియైన వేళకే చేశాడు)."

ఆంధ్రజ్యోతి - దీపావళి సంచిక

★